పాము కాటు బాధితునికి పరామర్శ

పరామర్శిస్తున్న సురేంద్ర, తదితరులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పాము కాటుకు గురై అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డుంబ్రిగూడ మండలం, గసబ పంచాయితీ నొగేలి గ్రామానికి చెందిన ఆదివాసి గిరిజన సంఘం నేత పి సత్యనారాయణను మంగళవారం ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, గసభ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్ పరామర్శించారు. అనంతరం సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సేవలు అందించాలని కోరారు. టైఫాయిడ్, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'హైడ్రో'తో పొట్ట కొట్టొద్దు

- ★ ప్రాజెక్టు రద్దుకు ఆదివాసీల ర్యాలీ
- ★ మజ్జివలసలో భారీ బహిరంగ సభ
- ★ మన్యవాసుల ఆక్రోశంతో

ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ రద్దు

జంబువలస జంక్షన్ నుంచి మజ్జివలస వరకు ఆదివాసీలు నిర్వహిస్తున్న నిరసన ర్యాలీ

ప్రజాశక్తి- హుకుంపేట: ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసి గిరిజనుల పొట్టకొట్టొద్దని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి పాసిపెంట అప్పల నర్స, పలువురు ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నేతలు డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులకు మంగళవారం మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామంలో ప్రజాభిప్రాయసేకరణ గ్రామసభ ఏర్పాటుకు ప్రభుత్వపరంగా అధికారులు సన్నద్ధమైన నేపథ్యంలో ఆగ్రహించిన ఆదివాసీలు జుంబువలస జంక్షన్ నుంచి మజ్జివలస కిలోమీటరు పొడుగునా వేలమంది గిరిజనులు కత్తులు గొడ్డళ్లు కర్రలు వంటి సాంప్రదాయ ఆయుధాలను పట్టుకొని, పెద్దఎత్తున నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులు వద్దని పదేపదే వ్యతిరేకిస్తున్నా, గ్రామసభ నిర్వహించాలని అధికారులు మొండిగా ముందుకు రావడంతో గిరిజనులు ఆక్రోశం వెల్లగక్కారు. గిరిజనుల ఆగ్రహాన్ని చూసిన అధికారులు తోకముడిచి ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ రద్దు చేసుకోవాల్సి వచ్చింది.

ఈ సందర్భంగా మజ్జివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు మజ్జి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ముఖ్యఅతిథులు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి పాసిపెంట అప్పల నర్స మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుతో గిరిజనులకు అడవులకు దూరం చేసి అన్యాయం చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని, ఇప్పటికైనా ప్రజలు మేల్కొని సమిష్టిగా ప్రతిఘటించి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. విద్యుదుత్పత్తి పేరుతో ఆదివాసీల భూములు బలవంతంగా లాక్కోవాలని చూడడం అన్యాయం, దీన్ని ఎంతగా వ్యతిరేకిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. అభివృద్ధి పేరుతో వినాశనానికి పూనుకోవడం సరికాదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు ఉన్న ప్రేమ గిరిజనుల మీద కూటమి ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయ మన్నారు. గిరిజనుల అభివృద్ధికి తోడ్పడే ప్రభుత్వా లైతే జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించి, 100శాతం విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకొని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ గిరిజన బతుకులు నాశనం చేయవద్దని కోరారు.

. ముందుగా హైడ్రో పవర్ ప్రాజెక్టు పోరాట కమిటీ సభ్యులు మజ్జి పార్వతి మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం తమ జీవితాలతో చెలగాటమాడొద్దన్నారు. బూర్జ ఎంపిటిసి మజ్జి హరి మాట్లాడుతూ బూర్జ పంచాయతీలోని 14 గ్రామాలు మూడు వేల మంది జనాభా కలిగి ఉన్నారని, హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో ప్రజలకు ఇబ్బంది గురిచేయెుద్దన్నారు. డ్రోన్లు సర్వే చేస్తూ గిరిజనులకు భయభ్రాంతులకు గురి చేయవద్దన్నారు. ప్రాంతీయ సంఘాలు, రైతు సంఘాలు కూడా హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నాయని, హుకుంపేట 13న మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బూర్జ పంచాయతీ సర్పంచ్ పాంగి మొత్తి, ఆదివాసీ గిరిజనసంఘం హుకుంపేట మండల కార్యదర్శి టి కృష్ణారావు, సిపిఎం మండల కార్యదర్శి వి లక్ష్మణరావు, వేంగడ సర్పంచ్ సూడపల్లి శివ, మాజీ ఎంపిటిసి గుండన్న, మాజీ సర్పంచ్ ఎస్. కొండలరావు, గిరిజన సంఘం నేతలు బొంజుబాబు, మజ్జి భాస్కరరావు, పోరాట కమిటీ సభ్యులు మజ్జి కృష్ణంరాజు, వరుణ్, పరశురాం, బాధిత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సురేంద్ర, అప్పలనర్స, తదితరులు

సికిల్‌సెల్ ఎనీమియాతో విద్యార్థిని మృతి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యంపై ఆగ్రహం
- కలెక్టర్ స్పందించి చర్యలు చేపట్టాలి : సర్పంచ్

విద్యార్థిని మృతిపై ఎటిడబ్ల్యుఒ, హెచ్‌ఎంలను ప్రశ్నిస్తున్న ఎంపిపి

కిల్లో అవంతిక (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -అనంతగిరి : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల 1కి చెందిన విద్యార్థిని సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధితో బారినపడి మృతి ,చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎగువశోభ పంచాయితీ హెక్కాగుడ గ్రామానికి చెందిన కిల్లో అవంతిక బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. అనారోగ్యంతో బాధపడుతూ గతనెల 31న ఆదివారం తన స్వగృహంలో మృత్యువాత పడింది. అయితే పాఠశాలలో ఉన్నప్పుడే అనారోగ్యానికి గురైన బాలికను సంబంధిత పాఠశాల యాజమాన్యం హెచ్‌ఎం శ్యాంసుందర్, డిప్యూటీ వార్డెన్ ఆసుపత్రిలో చేర్పించి అవసరమైన వైద్యసేవలు అందించాల్సిందిపోయి, నిర్లక్ష్యంగా విద్యార్థినిని ఇంటికి పంపించారు. అక్కడ ఎటువంటి వైద్యసేవలు అందకపోవడంతో ఆరోగ్యం విషమించి మృతి చెందింది.

విద్యార్థిని అనారోగ్యం చేసినప్పుడు స్పందించని హెచ్‌ఎం, వార్డెన్ ఇతర యాజమాన్య ప్రతనిధులు, బాలిక మృతి తర్వాత విషయం బయటకు పొక్కకుండా కుటుంబసభ్యులతో సంప్రదింపులకు వచ్చారు.అయితే తమ బిడ్డకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదని విద్యార్థిని తల్లిదండ్రులు అంటున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన హెచ్‌ఎం, వార్డెన్లపై కఠినచర్యలు చేపట్టాలనిస్థానిక సర్పంచ్ సొమ్మెల రూతు డిమాండ్ చేశారు.దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

విద్యార్థిని మృతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు : ఎంపిపి నీలవేణి

బాలికల ఆశ్రమోన్నత పాఠశాల-1లో సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతూ విద్యార్థిని మృతి ఘటనపై స్థానిక ఎంపిపి శెట్టి నీలవేణి స్పందించారు. మంగళవారం పాఠశాలను సందర్శించారు విద్యార్థుల ఆరోగ్యల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఆరో తరగతి విద్యార్థిని కె. అవంతిక మృతిపై హెచ్‌ఎం శ్యాంసుందర్, ఎటిడబ్ల్యుఒ వెంకటరమణలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థిని ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించిన హెచ్‌ఎం, వార్డెన్లపై తగు చర్యలకు జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. మండలంలోని పలు పాఠశాలలో 22 మంది సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్నారని, వారికి నాణ్యమైన వైద్యం అందించాలని అలాగే రూ.పది వేల పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాల హాస్టల్‌లో ఎఎన్‌ఎంను నియమించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కె. సింహాద్రి, పాంగి .అప్పారావు, పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం సుబ్బారావు పాల్గొన్నారు

మెనూ అమలులో నిర్లక్ష్యం వద్దు

- సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ విఎ స్వామినాయుడు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎ పిఒ స్వామినాయుడు

ప్రజాశక్తి-హుకుంపేట: మెనూ ప్రకారమే ఆహారం అందించాలని సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ విఎ స్వామినాయుడు అన్నారు.మంగళవారం హుకుంపేట మండలం తీగలవలస పంచాయతీ, పంతలచింత గ్రామంలోని ఎస్ఆర్ఎస్‌టిసి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలు, గదులు, వంటగది పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కొంత సమయం ముచ్చటించి, చదువుతున్న తీరును పరిశీలించారు. పాఠశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం హుకుంపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి. విద్యార్థులలో కొంతమంది యూనిఫామ్ వేసుకోకుండా ఉండడం గమనించారు. హుకుంపేట మోడల్ ప్రైమరీ స్కూల్‌లో మెనూ ప్రకారం గుడ్డు పెట్టకపోవడంపై హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాఠశాల భవనంపై చెట్టు పడిగ ఘటనపై ఆరా తీశారు. మండల పరిషత్ అధ్యక్షుడు రాంబాబుతో కలసి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు- 2 ను సందర్శించారు. అసంపూర్తిగా ఉండిపోయిన అదనపు తరగతి భవనం ప్రస్తుత స్థితిపై ప్రధానోపాధ్యాయుల నుండి ఆరా తీశారు. పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పర్యటనలో ఎంపిపి రాంబాబు, సమగ్ర శిక్ష సెక్టోరల్ ఆఫీసర్ పాత్రుడు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది, పిఆర్‌పిలు ఉన్నారు.

స్వల్పంగా తగ్గిన గోదావరి

గోదావరి కాస్త నెమ్మదించింది. వరదపోటు తగ్గడంతో ముంపు వాసులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. కానీ బంగాళాఖాతంలో అల్పపీడనం వార్త విని మళ్లీ ముంపు బాధితుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వరద తగ్గు ముఖం పట్టినా ఇంకా చాలా గ్రామాలకు వెళ్లేందుకు రహదారులు మునకలోనే ఉన్నాయి. దీంతో వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. గుట్టలపై, విషపురుగులు, పాముల మధ్య సహవాసం చేస్తున్నారు.

- పలు గ్రామాలకు ఇంకా రాకపోకలు బంద్
- శబరి తగ్గుముఖం
- తగ్గని సోకిలేరు ఉధృతి
- ముంపులోనే 326 జాతీయ రహదారి
- ఆంధ్రా - ఒడిశా మధ్య నిలిచిన రాకపోకలు
- విఆర్‌పురం - చింతూరు మండలాల మధ్య నాటు పడవలే దిక్కు
- అల్పపీడనం వార్తతో మళ్లీ ముంపు వాసుల్లో గుబులు

ఒడ్డుగూడెం వెళ్లేందుకు బోటు ఎక్కుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -విఆర్‌పురం: మండలంలోని పదిహేను రోజులుగా దిగువన కురుస్తున్న భారీ వర్షాలకు నదులు వాగులు ఉప్పొంగడంతో వి ఆర్ పురం మండలంలోని అడివివెంకన్నగూడెం, తుస్తివారిగూడెం, చింతరేగుపల్లి, కన్నాయిగూడెం, శ్రీరామగిరి, సీతంపేట గ్రామాల మధ్య రోడ్లపై వరద రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం ఉదయానికి గోదావరి నీటిమట్టం 40.70 అడుగులకు చేరింది. మధ్యాహ్నం మూడు గంటల నుండి స్వల్పంగా పెరిగి సాయంత్రం ఐదు గంటలకు భద్రాచలం వద్ద41.60 చేరింది అడవి వెంకన్నగూడెం, రామవరం, రామవరంపాడు, చొప్పల్లి, సప్తివారిగూడెం కన్నాయిగూడెం, చింతరేగుపల్లి, శ్రీరామగిరి, రహదారులు, ఇళ్ల చుట్టూ వరద తగ్గకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజులుగా ఇళ్ల చుట్టూ రహదారులపై వరద చేరడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితిలో ఉన్నామని అడవిలో మైదాన ప్రాంతంలో గుట్టలపై గుడారాలు ఏర్పాటు చేసుకొని పిల్లాపాపలతో ఓ పక్క దోమలు, మరోపక్క విషపురుగుల మధ్య దీనంగా బతుకుతున్నామని ప్రభుత్వ అధికారులు ఎవరూ ఇంతవరకూ వచ్చి చూడలేదని, గిరిజనులు అంటే ప్రభుత్వానికి ఇంత చిన్నచూపు తగదని పోలవరం ప్రాజెక్టుకు ఎంత త్యాగం చేస్తున్నా మమ్మల్ని ఇంత నీచంగా చూడటం ఎంతవరకూ సమంజసమని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఇక్కడ నుండి తరలించాలని ప్రజలకు సంబంధించి తక్షణమే నిత్యావసర సరుకులు, పిల్లలకు పాలప్యాకెట్లు, కిరోసిన్‌తో పాటు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

చింతూరు: శబరి, గోదావరి నదులు మంగళవారం క్రమేపి తగ్గుముఖం పట్టాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 41.60 అడుగులకు చేరింది. దిగువకు 8,52, 241 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. చింతూరు వద్ద శబరి నది క్రమేపి తగ్గుతూ 37 అడుగుల నుండి 30 అడుగులకు చేరింది. కుయుగూరు వాగు ఇంకా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జాతీయరహదారి 326 ముంపులోనే ఉంది. దీంతో ఆంధ్రా-ఒడిస్సా రాష్ట్రాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. సోకిలేరు వాగు ఇంకా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చింతూరు, విఆర్‌పురం రెండు మండలాలకు రవాణా ఆటంకంగా మారింది. నాటు పడవలపైనే ప్రజలు ప్రయాణిస్తున్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

విఆర్‌పురం: ఎగువన కురిసిన వర్షాలకు శబరి గోదావరి పొంగడంతో చొక్కానపల్లి గ్రామం ముంపునకు గురవటంతో కొండలపై పాకలు వేసుకుని ఉన్నామని ముంపు బాధితులు వాపోతున్నారు. సిపిఎం నాయకులు అధికారులతో మాట్లాడి నిత్యావసర సరుకులు తెప్పించి ఉపసర్పంచ్ దుర్గారావు సిపిఎం మండల కమిటి నాయకులు తోడంరాజు గుండెపుడి లక్ష్మణరావు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. సిపిఎం నాయకులు ఎప్పటికప్పుడు వచ్చి తమ పరిస్థితిని తెలుసుకుంటున్నారని సరుకులు ఇప్పించినందుకు సిపిఎం నాయకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గొంది ధారయ సీతమ్మ, వార్డు మెంబర్, విఆర్ఒ రామకృష్ణ గ్రామపెద్దలు పాల్గొన్నారు. మండలంలోని రామవరం పంచాయతీ అడివివెంకన్నగూడెం, సోముల గూడెం, శబరిరాయిగూడెం, రామవరంలో ఎంపిపి, సర్పంచ్ కారం. బుచ్చమ్మతో పాటు సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ బృందం చేతుల మీదుగా నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, పొడియం. శ్రీరామమూర్తి, వడ్లది రమేష్, సిపిఎం నాయకులు సుధీర్, బొప్పెన రాజు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

చింతూరు వద్ద శబరి నది ప్రవాహం

రంపచోడవరం ప్రత్యేక జిల్లా చేయాలని తీర్మానం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి పంచాయతీ పాలకవర్గం సమావేశం మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రంపచోడవరం ప్రత్యేక జిల్లా ఏర్పాటు చెయ్యాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న తామంతా జిల్లా విభజన తరువాత అల్లూరి సీతారామరాజు జిల్లా (పాడేరు) జిల్లా అవడంతో రంపచోడవరం ప్రాంత ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నారని రంపచోడవరం నుండి పాడేరు 250 కిలోమీటర్లు, ఎటపాక నుండి పాడేరు 295 కిలోమీటర్లు దూరమవుతుందని ఎటపాక ప్రజలు జిల్లా కేంద్రానికికన్నా రాష్ట్ర రాజధానికే ముందు వెళ్ళగలరని ఈ నేపథ్యంలో రంపచోడవరం కేంద్రంగా రంపచోడవరం, 7 మండలాలు, చింతురు 4 మండలాలు, ఏలూరు జిల్లాలో ఉన్న 4 మండలాలు, సబ్ ప్లాన్ గిరిజన గ్రామాలు 59 గ్రామాలు,11 పంచాయతీలు కలిపి పెద్దమల్లపురం మండల కేంద్రం ఏర్పాటు చేసి 17 మండలాలను రంపచోడవరం జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరూతూ పంచాయతీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమశ్రీ, ఉపసర్పంచ్ బుట్టరి రాజుబాబు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

తీర్మాన పత్రాలు చూపిస్తున్న లోతా రామారావు తదితరులు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

మాట్లాడుతున్న సిఐటియు సహాయ కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి-జికెవీధి: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. మండలంలో ఆర్‌వినగర్ పిహెచ్ఎపి ఆశవర్కర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆశ వర్కర్లు ఇంకా చాలా సమస్యలు పరిష్కారం చేసుకోవాల్సి ఉందని, అందుకు తగిన విధంగా ఐక్య పోరాటాలు చేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పద్మ, పిహెచ్ నాయకులు శివలక్ష్మి పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందించాలని వినతి

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: మండలంలో వరదల కారణంగా ఉపాధి కోల్పోయామని రేఖపల్లి ఎస్సీ కాలనీ హ్యాబిటేషన్‌కు సంబంధించిన గ్రామస్తులు తహసిల్దార్ సరస్వతికి మంగళవారం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. రేఖపల్లి ఎస్సీ కాలనీలో నిత్యావసర సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ సమస్యను పై అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నాగిరెడ్డికి ఘన నివాళి

నాగిరెడ్డి మృతదేహం వద్ద సిపిఎం నాయకుల నివాళి, ఇన్‌సెట్‌లో నాగిరెడ్డి ఫైల్ ఫొటో

ప్రజాశక్తి-కూనవరం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తిమ్మా నాగిరెడ్డికి సిపిఎం నాయకులు మంగళవారం నివాళు లర్పించారు. రేగులపాడు గ్రామానికి చెందిన నాగిరెడ్డి పార్టీ శాఖ సభ్యుడుగా సేవలందించారని జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వర రావు తెలిపారు. ఆయన తండ్రి అప్పన్న కూడా సిపిఎంలో సీనియర్ నాయకులని, నాగిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, సర్పంచ్ బొగ్గా రామారావు, శంకర్, నానుపల్లి వెంకటేశ్వరరావు, గుండం బాబురావు కార్యకర్తలు నివాళులర్పించారు.

రహదారి సమస్యను పట్టించుకోరా?

రాళ్లు తేలిన రహదారి

ప్రజాశక్తి - రంపచోడవరం : పెదగెద్దాడ నుండి వెట్టిచెలకలు వరకూ రహదారి పరమ అధ్వానంగా తయారైందని తక్షణమే రోడ్డు మరమ్మతులకు నిధులు కేటాయించాలని గిరిజన సంఘ జిల్లా నాయకులు సాదల విద్యాసాగర్ రెడ్డి డిమాండ్ చేశారు. రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడ్డాయని, రాళ్లు తేలిపోయాయని తక్షణమే మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సేంద్రీయ పంటల సాగుకు ప్రోత్సాహం

2028 నాటికి ఆర్గానిక్ జిల్లాగా అల్లూరి లక్ష్యం
ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నే సుబ్బారెడ్డి

పాడేరులో రాజ్మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు : ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రీయ పంటల సాగు అధికంగా ఉంటోందని, దీనికి ప్రభుత్వపరంగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు ఎపి విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నే సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం కాఫీ హౌస్‌లో 90 శాతం రాయితీపై గిరిజన రైతులకు రాజ్మా విత్తనాల పంపిణీని సహాయ కలెక్టర్ సాహిత్‌తో కలిసి ప్రారంభించారు. గిరిజన రైతులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ఏజెన్సీలో ఆర్గానిక్ పంటల సాగుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఎపి సీడ్స్ రాజ్మా విత్తనాలను 90శాతం రాయితీపై గిరిజన రైతులకు పంపిణీ చేసేందుకు ఇప్పటికే గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. సేంద్రీయ సాగులో పండే ఆహార ఉత్పత్తులను తినడం వల్లే గిరిజనప్రాంతాల్లో జనం ఆరోగ్యంగా ఉంటున్నారన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులు సెప్టెంబర్‌లో ముందస్తు రబీ పంటగా రాజ్మా సాగు చేస్తున్నారున్నారు. జిల్లాలో 4900 క్వింటాళ్ల రాజ్మా విత్తనాలను 90శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నామన్నారు. . కేజీ విత్తన ధర రూ.150 కాగా రూ.15 లకు రైతుసేవా కేంద్రాల నుంచి రైతులు పొందవచ్చని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సేంద్రీయ విధానంలో సాగుతో భూమిని, విత్తనాన్ని, రైతుని కాపాడుకొనే బాధ్యత రైతులందరిపైనా ఉందన్నారు.

ఎపి విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ జగదీశ్వరి, రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత చైర్మన్ గంగులయ్య, మాజీ మంత్రి మాణికుమారి, ఎంపిపి సోనారి రత్నకుమారి, ఎపి టూరిజం డైరెక్టర్ కె. రమేష్ నాయుడు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుకోవాలన్నారు ఇదే సమయంలో పంటలకు గిట్టుబాటు ధర లభించకపోతే నిల్వ ఉంచుకునేందుకు గిడ్డంగులు, రాయితీపై పనిముట్లు అందజేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్ నంద్ మాట్లాడుతూ 2028 నాటికి ఆర్గానిక్ జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యం జిల్లా కలెక్టర్ సూచనలతో వారానికి రెండు రోజులు చొప్పున రైతు సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పాడేరు పిఏసిఎస్ చైర్మన్ డి.వెంకటరమణ, ఒనిసిపల్లి సర్పంచ్ లకే పార్వతి, ఎపి విత్తనాభివృద్ధి సంస్థ డిఎం సాయి పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోని అనంతగిరి రైతుసేవా కేంద్రం వద్ద గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో రాజ్మా విత్తనాలను మంగళవారం మండల వ్యవసాయ శాఖాధికారి రంగారావు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ సోమ్మెల.రూతు ఎంపిపి శెట్టి నీలవేణి, జెడ్పిటిసి దీసరి. గంగరాజు పంపిణీ చేశారు. మండలానికి 22 క్వింటాళ్ల విత్తనాలు మంజూరుకాగా, ఆధార్, భూమి పట్టాల ఆధారంగా 72మంది రైతులకు 14క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎగువ శోభ సర్పంచ్ కొర్రా సింహాద్రి కూటమి నాయకులు జోగులు, మురళి, శ్యామ్, సచివాలయ సిబ్బంది జ్యోతి, కుమారి పాల్గొన్నారు.

అనంతగిరిలో రాజ్మా విత్తనాలు పంపిణీ చేస్తున్న గంగరాజు, తదితరులు

హుకుంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గిరిజన రైతులకు 90శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను ఎంపిపి కూడా రాజుబాబు మంగళవారం పంపిణీ చేశారు.శాస్త్రీయపద్ధతిలో సాగుచేసి, అధిక దిగుబడులు, ఆదాయం పొందాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపిడిఒ రమాదేవి, వైస్ ఎంపిపి ఎస్. కొండల రావు, ఎంపిటిసిలు కొమ్మరమ్మ, మోహన్, లక్ష్మి,(గామ సర్పంచులు, స్థానిక నాయకులు, రైతు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

హుకుంపేటలో రైతులకు రాజ్మా విత్తనాల పంపిణీ

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని ఉప్ప గ్రామంలో వినాయక ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. మండపం వద్ద విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో బాగు చేసేందుకు యత్నించిన గ్రామానికి చెందిన దుప్ప చంటిబాబు (25) విద్యుదాఘాతానికి గురై మృత్యువాత మెయిన్ బోర్డ్‌ను ఆఫ్ చేశారని భావించి మరమ్మతులకు పూనుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అస్వస్థత గురైన చంటిబాబును వెంటనే తోటి యువకులు స్థానిక ఉప ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యానికి పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించినా ప్రాణాలు నిలువలేకపోయాడు. ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. చంటిబాబు కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరై విలపించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ సూర్యనారాయణ గ్రామాన్ని సందర్శించి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న సిపిఎం నేతలు

తల్లిని కోల్పోయిన శిశువును ఆదుకోవాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: తల్లిని కోల్పోయిన నాలుగు నెలల పసి బాబును ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు, గసబ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గసబ పంచాయతీ మొర్రిగుడ గ్రామానికి చెందిన పాంగి. బుచ్చలమ్మ (26) నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. బుచ్చలమ్మ మృతితో నాలుగు నెలల పసిబాబు దిక్కులేని వాడయ్యాడు. బాధిత బాలునికి నెలరోజులకు సరిపడా పాల కోసం సిపిఎం నేతలు ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వపరంగానూ, దాతలు ముందుకొచ్చి బాధిత పసికందును చేదోడుగా నిలవాలని సిపిఎం నేతలు కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాంగి దొరబాబు, సుబ్బారావు, కొత్తు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-పెదబయలు : గోమంగి కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ విశాఖపట్నంలోని టిడిపి కార్యాలయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి గోమంగి మండల సాధన సమితి నాయుకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. టిడిపి అరకు పార్లమెంటు అధ్యక్షులు, గిరిజన కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌కు, అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి దొన్నుదొరకు కూడా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గోమంగి మండల సాధన సమితి నాయకులు మాట్లాడుతూ గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని మూడు దశాబ్దాల నుండి పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. తమ పోరాటానికి హేతుబద్ధమైన కారణాలు ఉన్నాయని, ముఖ్యంగా ఇంజరి, గిన్నెలకోట, జామిగూడ గ్రామపంచాయతీల ప్రజలు విద్యా, వైద్యం, నిత్యవసరాల కోసం వాగులు, వంకలు దాటవలసిన పరిస్థితి నెలకొందని తెలిపారు. 17 పంచాయితీలకు కేంద్ర బిందువుగా ఉండి భౌగోళికంగా చుట్టుపక్కల గ్రామ పంచాయతీలకు అన్ని విధాల అనుకూలంగా ఉన్న గోమంగిని నూతన మండలం చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సాధన సమితి ప్రధాన కార్యదర్శి కొమ్మ పృధ్వీరాజు, గౌరవాధ్యక్షులు కూడా బొంజుబాబు, జర్సింగి సూర్యనారాయణ, కొమ్మ అనంత పద్మనాభం, కూడా రాధాకృష్ణ, కోర్ర సత్తిబాబు, కొమ్మ బాలరాజు, గంపరాయి ధనుంజయ్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టిరాజు అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులు, పోలీసాధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించండి
- సహాయ కలెక్టర్ సాహిత్

ప్రజాశక్తి -పాడేరు: ఆశాకార్యకర్తలు అంకితభావంతో విధులు నిర్వహించి, మెరుగైన వైద్యం అందించాలని పాడేరు సహాయ కలెక్టర్ సాహిత్ సూచించారు. మంగళవారం ఆశా దినోత్సవం సందర్భంగా పాడేరు మండలం మినుములూరు పిహెచ్‌సి పనుల నిర్వహణను సహాయ కలెక్టర్ సాహిత్ పరిశీలించారు. అనంతరం ఆశాడే సమావేశంలో పాల్గొన్నారు. ఆశాల జాబ్ చార్ట్, రిపోర్టింగ్, రిఫెరల్ సర్వీసెస్, యాంటినాటల్, ప్రసవానంతర కేసుల సేవలు, పిహెచ్‌సి వద్ద కార్యకలాపాలు, మందుల రికార్డులు, వ్యాక్సిన్, ప్రయోగశాల సేవలు, డెలివరీలు, వార్డ్ విధులు. రిఫెరల్ సర్వీసెస్, అంబులెన్స్ మెయింటెనెన్స్, సికిల్‌సెల్ అనీమియా, టిబి, హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్వహణపై ఆరాతీశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ విశ్వేశ్వర నాయుడు, డాక్టర్ సాయిశ్రీ, డాక్టర్ అఖిల్, పిహెచ్‌సి హెల్త్ సూపర్ వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ చింతపల్లిలోనే నెలకొల్పాలి

మాట్లాడుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-చింతపల్లి : కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను చింతపల్లిలోనే నెలకొల్పాలని వైసిపి చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి బెన్నిబాబు, తమ్మెంగుల సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను అనకాపల్లి జిల్లా, మాకవరపాలెం మండలంలోని శెట్టిపాలెంలో ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆలోచన సరికాదన్నారు. కాఫీ ఉత్పత్తికి ప్రధాన కేంద్రమైన చింతపల్లిలోనే ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే స్థానిక రైతుల శ్రమకు సరైన గుర్తింపు లభించడంతో పాటు, గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఉపాధి లేక వందలాది మంది గిరిజనులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం యూనిట్‌ను మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేయడం గిరిజనుల ప్రయోజనాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. స్థానిక గిరిజనుల ఆశలు, అవసరాలను విస్మరించి, ప్రాసెసింగ్ యూనిట్‌ను తరలించడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పార్టీలకతీతంగా, గిరిజన సంఘాలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్, కొత్తపాలెం సర్పంచ్ వనగల సోమరత్నం, వైస్ సర్పంచ్ పాంగి మోహన్‌రావు, ఎర్రబొమ్మల సర్పంచ్ లోతా పండయ్య, కుడుముసారి పంచాయతీ వార్డు సభ్యులు బొండా సింహాచలం, వైసిపి నాయకులు మోరి రవి, పాపిడి రాజు, కొర్ర బాలరాజు, వెలుసూరి సింహాచలం, సుంద్రు చిన్నబ్బాయి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పెదబయలు : పెదబయలు మండల కేంద్రంలో దుర్గాదేవి ఉత్సవాలు నిర్వహణకు మోటారు యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం జరిగిన సమావేశంలో ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా సమరెడ్డి పూర్ణయ్య, కార్యదర్శిగా గండేరు జీవన్ కుమార్, కోశాధికారిగా సర్వసిద్ధి రామారావు ఎన్నికయ్యారు. మోటారు యూనియన్ ఉన్న ప్రతి ఒక్కరూ సభ్యులుగా ఉంటారని, సీనియర్ సభ్యులు గౌరవాధ్యక్షులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. మోటార్ యూనియన్ మాజీ అధ్యక్షులు చెండా చిట్టిబాబు అమ్మవారి విగ్రహన్ని వితరణ చేయనున్నారు.

కండిషన్‌లో లేని బస్సుతో అష్టకష్టాలు

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరిసీతారామరాజు జిల్లా విశాఖ మన్యంలో కండిషన్‌లో లేని ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతూ అల్ట్రా డీలక్స్ పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం డిపోకు చెందిన విశాఖ వయా నర్సీపట్నం చింతపల్లి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే బస్సు సర్వీస్ సోమవారం రాత్రి 7:30 కి విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సుమారు 30 మంది ప్రయాణికులతో బయలుదేరింది. నర్సీపట్నం ముఖద్వారం దాటి లంబసింగి ఘాట్ రోడ్డు ఎక్కుతుండగా బస్సు వేగంగా వెళ్లడం లేదు. డ్రైవర్ పరిశీలించి సాంకేతికలోపం తలెత్తిందని గ్రహించాడు. సీలేరు మీదగా మోతుగూడెం మంగళవారం ఉదయం 7:45 నిమిషాలకు చేరుకున్నారు. బస్సు నిర్ణీత సమయం ప్రకారం విశాఖపట్నంలో సోమవారం రాత్రి 7.30కు బయలుదేరి మంగళవారం ఉదయం 6 గంటలకు భద్రాచలం కాంప్లెక్స్‌కు చేరాల్సి ఉంది.నిర్ణీత సమయం కన్నా అదనంగా ఆరు గంటలు సమయం పట్టింది. దీంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోయారు. కండిషన్ కలిగిన బస్సులు నడపాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

విశాఖ భద్రాచలం నైట్ సర్వీస్‌బస్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-విఆర్‌పురం: చిన్నమట్టపల్లి విఆర్ఒ వినోద్ సమాచారం ప్రకారం మంగళవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో వి.ఆర్‌పురం మండలం, చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధిలోని ప్రతిపాక గ్రామ శివారులో ఒక గుర్తు తెలియని మృతదేహం శబరి నది నుండి కొట్టుకు వచ్చింది. మృతుని వయస్సు సుమారు 30-35 సంవత్సరాల మధ్యలో ఉంటుంది. ఎత్తు 5.2 అడుగులు. ఎరుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. ఎవరైనా గుర్తిస్తే ఎస్ఐ సంతోష్‌కుమార్ 9490617851, 9599499366 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో వరుస మరణాలు

ప్రజాశక్తి - రంపచోడవరం : డివిజన్ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో వరుసగా విద్యార్థుల మరణాలు కలకలం రేపుతున్నాయి. గత మూడునెలల్లో ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళ్తే ఇటీవల వాడపల్లి ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఉరేసుకుని మృతి చెందగా, మారేడుమిల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన మరో విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. తాజాగా, రంపచోడవరం మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెందాడు. తల్లిదండ్రులు, గిరిజన సంఘాలు, స్వచ్ఛందసంస్థలు ఈ మరణాలకు హాస్టల్ వార్డెన్లు, హెచ్ఎంలు పర్యవేక్షణ లోపించిన ఉన్నతాధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పిల్లలను చదువుకుంటారని వసతిగృహాలకు పంపిస్తే, మృతదేహాలుగా తిరిగి ఇంటికి వస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి మృతికి కారణమైన వారిపై కేవలం నామమాత్ర చర్యలతో వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నా యి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని గిరిజనసంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మారేడుమిల్లిలోని ఆశ్రమ పాఠశాల

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

చింతూరు : వైఎస్ విగ్రహం వద్ద పార్టీ నాయకుల నివాళులు

డుంబ్రిగుడలో నివాళులర్పిస్తున్న వైసిపి శ్రేణులు

అరకులోయలో నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి- విఆర్‌పురం: వైసిపి మండల కమిటీ ఆధ్వర్యంలో రేఖపల్లిలో దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు, మాజీ మండల అధ్యక్షులు పోడియం గోపాల్, జిల్లా ఆర్టిఐ విభాగం అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ తదితరులు నివాళులర్పించారు.

సీలేరు: జికెవీధి మండలం సీలేరులో వైయస్ వర్ధంతి నిర్వహించారు. ఎంపిటిసి ఎల్లా సాంబమూర్తి, వైసిపి నాయకులు వెంకటరావు, బుజ్జి పెద్దబలరాం పలువురు నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేపట్టారు.

కొయ్యూరు: కొయ్యూరు మండలం నల్లగొండ పంచాయితీలో వైఎస్ వర్ధంతిని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు బిడిజన అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి రమేష్‌బాబు, జెడ్పీటీసీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చింతూరు : వైఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కారం కన్నరావు, మండల కన్వీనర్ రామలింగరెడ్డి, ఖాజా, మన సత్యం , జిక్రియ పాల్గొన్నారు.

మారేడుమిల్లి: వైయస్ వర్ధంతి సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు సత్తి సత్యనారాయణరెడ్డి, రంపచోడవరం నియోజకవర్గ ఆర్టిఐ అధ్యక్షులు గొర్లె అనిల్ ప్రసాద్ (బాబ్జీ) నివాళులర్పించారు. పార్టీ నాయకులు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

జికె వీధి: మండల కేంద్రంలో వైసిపి మండల అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్ వర్ధంతి నిర్వహించారు. రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరం: ఎంపిపి పల్లాల కృష్ణారెడ్డి. జడ్పిటిసి బేబీ రత్నం, పార్టీ మండల అధ్యక్షులు ఎజ్జు వెంకటేశ్వరరావు పార్టీ కార్యాలయం ఆవరణలో వైఎస్ వర్ధంతి నిర్వహించారు. సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ: అరకులోయలో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ డాక్టర్.కుంభా రవిబాబు, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాలలు వేసి నివాళు లర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాజశేఖర్‌రెడ్డి అమలుపరిచిన సంక్షేమ కార్యక్రమాలు మరువలేనివని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాంగి చిన్నారావు, చెట్టి వినయ్, శెట్టి అప్పాలు, జెడ్‌పిటిసిలు శెట్టి రోషిణి, చటారి జానకమ్మ, ఎంపిటిసి దూరియా ఆనంద్ కుమార్, స్వాభి రామమూర్తి గడ్డం నర్సింగరావు, ఎల్.బి. కిరణ్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి వైసిపి నాయకులు పూలదండలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎంపిపి ఈశ్వరి, జెడ్‌పిటిసి జానకమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు పి పరశురాం వైస్ ఎంపిపి ఎస్.ఆనంద్, సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు కె హరి, సర్పంచ్ వెంకటరావు, జి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఎం.శంకర్, విజయదశమి పాల్గొన్నారు.

చింతపల్లి : మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా చింతపల్లి జెడ్పిటిసి పోతురాజు బాలయ్య ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం చింతపల్లి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బెన్నిబాబు, మోరి రవి, సర్పంచ్‌లు సలిమితి లక్ష్మయ్య, సమిడి గోపాల్, వి సోమరత్నం, లోతా పండయ్య తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల పవన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కొయ్యూరు : జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు రాజేంద్రపాలెంలో ఘనంగా నిర్వహించారు. అరకు పాడేరు ఇన్‌చార్జి, జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ ఒంపూర్ గంగులయ్య సూచనల మేరకు రాజేంద్రపాలెం నుండి కొయ్యూరు వరకు బైక్ ర్యాలీగా వెళ్లి తర్వాత కేక్ కట్ చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో రోగులకు పాలు రొట్టెలు పంపిణీ చేశారు. కొయ్యూరు మండల అధ్యక్షులు గూడెం లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు సాగిన బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి శేషుబాబు పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరులో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వనములరాము, బాలు, సాయి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: మండల కేంద్రంలో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు కూటమి నాయకులు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు మడివి రాజు, వీర మహిళ కవిత, టిడిపి మండల మాజీ అధ్యక్షులు ఎండి జహంగీర్ పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మండల కేంద్రంలో జనసేనాని జన్మదిన వేడుకలు మండల పార్టీ అధ్యక్షులు మళ్ళ దుర్గాప్రసాద్, యూత్ అధ్యక్షులు బిశెట్టి సత్యకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు, పాలు,పండ్లు అందించారు. మారేడుమిల్లి టిడిపి మండలాధ్యక్షులు గురుకు శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జికె వీధి: కేక్ కట్ చేస్తున్న అభిమానులు, కార్యకర్తలు

జికె వీధి: గూడెంకొత్తవీధి మండలంలో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అరకు పార్లమెంటు ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యం బాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వంతల రాజుబాబు, మట్టం శ్రీనివాస్, మర్రి మనోహర్, వంతల సందేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : పుట్టిన రోజు వేడుకల్లో జనసేన నేతలు

చింతపల్లి: మాట్లాడుతున్న జనసేన నేతలు